క్లుప్తంగా

పోలీస్ ప్రజావాణిలో 66 ఫిర్యాదులు

విజయవాడస్పోర్ట్స్: పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ప్రజావాణి)లో 66 మంది ఫిర్యాదులు అందజేశారు. డీసీపీలు కృష్ణమూర్తి నాయుడు, ఉదయరాణి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నగదు లావాదేవీలపై తొమ్మిది, కుటుంబ కలహాలపై ఆరు, భూ వివాదాలపై ఏడు, మోసాలకు సంబంధించి 15, వేధింపులపై ఏడు, దొంగతనాలపై ఐదు, చిన్న చిన్న వివాదాలపై 17 మంది ఫిర్యాదులిచ్చారు. ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సంబంధిత స్టేషన్ అధికారులను డీసీపీలు ఆదేశించారు.

అథ్లెట్ సాహిల్‌కు అభినందన



విజయవాడస్పోర్ట్స్: తమిళనాడులోని కోయంబత్తూరులో ఇటీవల జరిగిన జాతీయ జూనియర్ (అండర్-16) అథ్లెటిక్స్ 80 మీటర్ల హార్డిల్స్‌లో బంగారు పతకం సాధించిన కె.ఎస్.ఎస్.సాహిల్ బాబును శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అభినందించారు. ఏలూరుకు చెందిన సాహిల్ శాప్ కార్యాలయంలో చైర్మన్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్, అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జి.వి.ఎస్. ప్రసాద్, తెలుగు యువత ఏలూరు పార్లమెంట్ అధ్యక్షుడు సూర్యచందు పాల్గొన్నారు.

రాష్ట్ర స్కేటింగ్ పోటీల్లో రాణించిన జెస్సీరాజ్, జోయల్‌ఆదర్శ్

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి 36వ స్కేటింగ్ పోటీల్లో విజయవాడకు చెందిన మాత్రపు జెస్సీరాజ్, మాత్రపు జోయల్ ఆదర్శ్ సత్తాచాటారు. ఈ నెల ఆరు నుంచి 11వ తేదీ వరకు మంగళగిరిలోని మునిసిపల్ స్టేడియంలో జరిగిన ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 250 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల్లో జెస్సీరాజ్ మూడు (ఇన్‌లైన్ విభాగంలో సిల్వర్, సోలో డాన్స్ విభాగంలో సిల్వర్, ఫిగర్ విభాగంలో బ్రాంజ్) పతకాలు, జోయల్ ఆదర్శ్ రెండు (ఇన్‌లైన్, ఫిగర్ విభా గాల్లో బ్రాంజ్) పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఏపీ స్కేటింగ్ సంఘం కార్యదర్శి థామస్‌చౌదరి, చైర్మన్ పవన్‌కుమార్, సీనియర్ కోచ్ సింహాద్రి అభినందించారు.

దుర్గమ్మ సన్నిధిలో నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీ కూచిపూడి నృత్యాలయానికి చెందిన పలువురు చిన్నారుల నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి పంచ హారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై శివసాయి, త్రిపద గాయత్రి, ఇషిత, గీతాంజలి, నవ్యా, సాద్విక పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. ప్రదర్శన అనంతరం ఆలయ డీఈఓ రత్నరాజు చిన్నారులకు అమ్మవారి చిత్రపటం, ప్రశంసా పత్రం, ప్రసాదాలను అందజేశారు. అనంతరం అమ్మవారి దర్శనం కల్పించారు.

'గీతాభిషేకం' పుస్తకావిష్కరణ




ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై సోమవారం గీతాభిషేకం పుస్తకావిష్కరణ జరిగింది. పచ్చిపులుసు సూర్యనారాయణ దుర్గమ్మ, మల్లేశ్వర స్వామిపై రచించిన 108 గీతాలతో ముద్రించిన గీతాభిషేకం పుస్తకాన్ని ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు చెరుపు ఆదినారాయణ పర్యవేక్షించారు.

30 మందికి జరిమానా

విజయవాడస్పోర్ట్స్: మద్యం మత్తులో మోటారు వాహనాలు నడిపిన 30 మందికి రైల్వే కోర్టు న్యాయమూర్తి ఆర్.వి. శర్మ సోమవారం జరిమానా విధించారు. ఆరవ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 30 మంది పట్టుబడ్డారు. పట్టుబడిన ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారు.

దుర్గమ్మ సేవలో స్వామీజీలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను సోమవారం పలువురు స్వామీజీలు దర్శించుకున్నారు. నేపాల్‌కు చెందిన మహాస్వామిజీ మహంత్ గిరి లకంమాన్ మహారాజ్, శ్రీస్వామి బోధ యోగి అమ్మవారి ఇంద్రకీలాద్రికి విచ్చేయగా, ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం స్వామీజీలకు ప్రసాదాలను ఆలయ అర్చకులు అందజేశారు.

శిక్షణ పొందితే.. పతకం ఖాయం

- కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్ స్విమ్మర్ల ప్రతిభ
- జూనియర్లకు దీటుగా రాణిస్తున్న సీనియర్లు
- జాతీయ స్థాయి పోటీలకు జూనియర్ల ఎంపిక



స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందుతున్న బాల, బాలికలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్.. ఒకప్పుడు కొత్తగా స్విమ్మింగ్ నేర్చుకునే చిన్నారులకు ప్రాథమిక మెలుకువలు నేర్పించే శిక్షణ కేంద్రం. వేసవి సెలవుల్లో చిన్నారులకు సమ్మర్ క్యాంప్ నిర్వహించే ప్రదేశం. ఇప్పుడు కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందడమంటే మెడల్స్ సాధించమే అనే భావన వచ్చేలా కోచ్ రఫీ శిక్షణ ఇస్తున్నారు. జూనియర్ కేటగిరీలో శిక్షణ పొందుతున్న నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు స్విమ్మింగ్ పోటీల్లో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతున్నారు. జూనియర్ స్విమ్మర్లకు దీటుగా సీనియర్ స్విమ్మర్లు రాణించి, కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్ పేరుకు జాతీయ స్థాయిలో నిలుపుతున్నారు.

ప్రత్యేక శిక్షణ

46వ డివిజన్ పరిధిలో నగర పాలక సంస్థ కేఎల్ రావు పేరిట స్విమ్మింగ్ పూల్ నిర్వహిస్తోంది. రోజూ ఉదయం, సాయంత్రం వేళ జూనియర్లు, సీనియర్లతో పాటు మహిళలు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. ఉదయం ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. ఉదయం తొమ్మిది నుంచి 10 గంటల వరకు మహిళలకు శిక్షణ ఇస్తారు. తిరిగి సాయంత్రం 4.30 నుంచి రాత్రి ఆరు గంటల వరకు మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. ఇక సాయంత్రం ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు చిన్నారులు, విద్యార్థినీ విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. ఇక రాత్రి ఏడు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు పోటీలకు సిద్ధమయ్యే స్విమ్మర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. జూనియర్ స్విమ్మర్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతుండగా, సీనియర్ స్విమ్మర్లు సైతం తమ ప్రతిభను చూపి మెడల్స్‌ను సాధించడంతో పాటు చక్కటి ఆరోగ్యాన్ని పొందుతున్నారు. ప్రస్తుతం కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్‌లో 50 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు.



రాష్ట్ర స్థాయిలో రాణించిన సీనియర్ స్విమ్మర్లు

పోటీలకు సిద్ధమవుతున్న మరో 20 మంది విద్యార్థులు ఉన్నారని కోచ్ రఫీ తెలిపారు.

ప్రతిభ చూపుతున్న సీనియర్లు

గత నెల 27వ తేదీన గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ చాంపియన్స్ పోటీల్లో కేఎల్ రావు స్విమ్మింగ్ పూల్‌కు చెందిన పలువురు సీనియర్లు వివిధ కేటగిరీల్లో సత్తాచాటారు. 50-54 ఏళ్ల కేటగిరీలో ఎండీ షమీ మూడు విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాలను సాధించారు. 25-29 ఏళ్ల కేటగిరీలో షేక్ ఆర్షద్ రెండు మెడల్స్, బి.పృథ్వీ ఒక మెడల్, 35-39 ఏళ్ల కేటగిరీలో వై.వి.డి.జి. కృష్ణారెడ్డి ఒక మెడల్ సాధించారు. 35-39 ఏళ్ల కేటగిరీలో ఎస్.గణేష్‌కుమార్ ఒక మెడల్, 40-44 ఏళ్ల కేటగిరిలో కె.కిశోర్ రెండు మెడల్స్, 50-54 ఏళ్ల కేటగిరిలో ఎల్.శ్రీనివాసరావు ఒక మెడల్, 55-59 ఏళ్ల కేటగిరిలో పి.రవిచంద్రారెడ్డి మూడు మెడల్స్‌ను సాధించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ఈ నెల ఐదు నుంచి ఏడో తేదీ వరకు పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్స్ గేమ్స్ చాంపియన్స్ పోటీల్లో కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందిన పలువురు విద్యార్థులు ప్రాతినిధ్యం వహించారు. ఉత్తమ ప్రతిభ కనభర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 24వ తేదీ నుంచి గుజరాత్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు అక్కడ కూడా రాణించేలా మరింత శిక్షణ పొందుతున్నారు. ఎన్.స్మృతి హర్షిక రెండు మెడల్స్, ఎన్.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

చంద్ర హర్షిల్ ఒక మెడల్, కె.భావేష్ ఒక మెడల్‌ను సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించారని కోచ్ రఫీ పేర్కొన్నారు.

సుజనా.. పశ్చిమకు ఏం చేశావో చెప్పాలి

- ఐదు నెలలుగా నియోజకవర్గంలో అభివృద్ధి నిలిచిపోయింది
- వారానికొకసారి కానూరు సమావేశంలో తప్ప కనపడని ఎమ్మెల్యే
- వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి



మాట్లాడుతున్న వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనాచౌదరి గడిచిన ఐదు మాసాల్లో ప్రజలకు ఏమి మేలు చేశారో చెప్పాలని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు ప్రశ్నించారు. తన కార్యాలయంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఐదు నెలలుగా ఒక్క అభివృద్ధి పని జరగలేదన్నారు. డ్రెయిన్లలో పూడిక తీయటం, వీధి దీపాలను వెలిగించటమే అభివృద్ధిగా సుజనాచౌదరి ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం పశ్చిమ నియోజకవర్గానికి ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. తాము విద్యాధరపురంలో అభివృద్ధి చేసిన స్టేడియాన్ని పూర్తిగా నాశనం చేశారని, కనీసం వాకింగ్ ట్రాక్ లేకుండా చేయడం దారుణమని పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో స్టేడియానికి నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. నియోజకవర్గం సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే సుజనా చౌదరి విఫలమయ్యారని, వారానికి ఓ రోజు వస్తున్నారని, అది కూడా కానూరు వెళ్లి ప్రజలు సమస్యలు విన్నవించుకోవాలని విమర్శించారు. ప్రజలకు ఎమ్మెల్యే అందుబాటులో లేని నియోజకవర్గం ఏదైనా ఉందంటే అది పశ్చిమ నియోజకవర్గమేనన్నారు. ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే సుజనా చౌదరి చోటా మోటా నాయకులు అందరికీ వసూళ్లపై దృష్టి తప్ప, ప్రజా సంక్షేమంపై లేదని విమర్శించారు. దయచేసి కొండ ప్రాంతంలో ఉన్న ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. నియోజకవర్గానికి ఎలాగో నిధులు కేటాయించలేరు కాబట్టి పేద ప్రజలను ఆదుకోవాలన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను సైతం పూర్తి చేయటంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ శిరంశెట్టి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవల్లో యూనియన్ బ్యాంక్ అగ్రగామి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సామాజిక సేవల్లోనూ అగ్రగామిగా ఉందని ఆ బ్యాంక్ విజయవాడ రీజియన్ హెడ్ ఎం.శ్రీధర్ అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 106వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బ్యాంక్ విజయవాడ రీజనల్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా రక్తదానం, ఉచిత వైద్య శిబిరం, క్యాన్సర్ అవగాహనా సదస్సు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. 106 ఏళ్లుగా దేశ ప్రజల అభివృద్ధికి, ఆర్థిక అభ్యున్నతికి యూనియన్ బ్యాంక్ అండగా ఉందన్నారు. రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో ఉద్యోగులు, అధికారులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఉదయం నుంచి బ్యాంకు కార్యాలయంలో



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న శ్రీధర్

మణిపాల్ హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం జరిగింది. సాయంత్రం డాక్టర్ లక్ష్మీప్రసూన క్యాన్సర్‌పై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డెప్యూటీ జోనల్ హెడ్ ఎం.సీతారామారావు, ఏజీఎంలు ఐ.ఎస్.ఎస్. మూర్తి, హరీష్ బేతా, రెడ్‌క్రాస్ సొసైటీ వైద్య నిపుణుడు డాక్టర్ ఎస్.మదన్‌మోహన్ పాల్గొన్నారు.

ప్రజాఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించాలి

పటమట(విజయవాడతూర్పు): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి ఒక్క ఫిర్యాదును ఆయా శాఖాధిపతులు కచ్చితంగా ఫీల్డ్‌లోకి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కమిషనర్ స్వయంగా నగరవాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కమిషనర్ ధ్యాన చంద్ర మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి శాఖాధిపతులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్యం నిర్వహణ, ఆక్రమణలు, సుందరీకరణ, నీటి కులాయి, సీసీ రోడ్లు, భూగర్భ డ్రెయినేజీ, డ్రెయిన్ కల్వర్టులు, ఇంటి పట్టా, ఆస్తి పన్నుల్లో డోర్ నంబర్ సరి చేయడం, డ్రెయినేజీ తదితర సమస్యలపై 13 ఫిర్యాదులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి.ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యనారాయణ కుమారి, జాయింట్ డైరెక్టర్, ఇన్‌చార్జి పీఓ (యూసీడీ) డాక్టర్ లత, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, డీఎఫ్ఓ మల్యాద్రి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



ప్రజాఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని మైనార్టీస్ వెల్ఫేర్ డే కార్యక్రమం జరిగింది. రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ నిర్వహించిన ఈ కార్యక్రమంలో భవానీపురం సీఎస్ఐ చర్చి పాస్టర్ దానియేలును మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సన్మానించారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ కృషి స్ఫూర్తిదాయకం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్



మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దేవినేని అవినాష్ తదితరులు



మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యావ్యవస్థను పటిష్టం చేసి, ప్రాథమిక విద్యను బలోపేతం చేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రిగా చేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ 136వ జయంతి వేడుకలు సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో జరిగాయి. ఆయన చిత్రపటానికి దేవినేని అవినాష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అవినాష్ మాట్లాడుతూ.. మౌలానా అబుల్ కలాం ఆజాద్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ స్ఫూర్తితో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. గ్రామ స్వరాజ్యం కోసం సచివాలయాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్, మైనార్టీ నాయకులు మీర్ హుస్సేన్, ఎండీ రిజ్వాన్, పార్టీ నేతలు భీమిశెట్టి బాబు, సుభాషిణి, కోటి నాగులు, మాతంగి రాజేష్, మెరకనపల్లి కుటుంబరావు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయ సాధనకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడ్డారని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అబుల్ కలాం ఆజాద్ దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా ఎనలేని సేవలు అందించారని, విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్యా విధానంలో అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి, శిరంశెట్టి పూర్ణచంద్రరావు, నాయకులు హయత్, బాజీ బాబా, నజీర్, మస్తాన్, ఖాదర్, షఫీవుల్లా, సుభాని ఖాన్, హబీబుల్లా, పొలిమెట్ల శరత్, బూదాల శ్రీను, విశ్వనాథ రవి, మద్ది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అబుల్ కలాం జయంతి వేడుకలు

వించిపేట(విజయవాడపశ్చిమ): వించిపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను పార్టీ 55వ డివిజన్ మైనార్టీ నాయకుడు షేక్ బాజీబాబా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు ఇర్ఫాన్, షేక్ హయాత్, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పొలిమెట్ల శరత్‌బాబు, నాయకులు సంగీత్‌బాబు, పైడాడ శ్రీనివాసరావు, పల్లె బాబు, సునీల్, దుర్గభవాని తదితరులు పాల్గొన్నారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకున్న భక్తులు స్వామికి పంచామృత అభిషేకాలు జరిపించారు. కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అర్చకుడు విన్నకోట శ్రీనివాసరావుశర్మ స్వామి వారికి అభిషేకాలు నిర్వహించిన అనంతరం విశేషంగా అలంకరించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం వద్ద కార్తిక దీపాన్ని వెలిగించగా, పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి దామోదరుడికి పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ రావూరి వెంకటేశ్వరరావు,ఆలయ ఫౌండర్ చైర్మన్ నందిపాటి నాగ వెంకట శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

భీమన వారి పేటలో...

శ్రీవిజయదుర్గా రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామికి తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు పంచామృత అభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మ స్వామికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపోత్సవం, ఆకాశ దీపం కార్యక్రమాన్ని నిర్వహించగా, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



పాతశివాలయంలో స్వామికి అభిషేకం

చిట్టినగర్‌లో....

కొత్త అమ్మవారి సన్నిధిలోని స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిగాయి. స్వామికి అభిషేకాలు నిర్వహించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో క్యూలైన్ ఆలయం వెలుపలకు చేరింది. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో దీపాలంకరణ సేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రసాద్ శర్మ స్వామి వారికి పూజా కార్యక్రమాలను జరిపించగా, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్తిక దీపాలతో కళకళలాడిన ఆలయాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శైవాలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. జిల్లాలోనే అత్యంత పురాతన ఆలయంగా ప్రసిద్ధికెక్కిన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో స్వామిని దర్శించుకునేందుకు తెల్లవారుజామున మూడు గంటల నుంచే భక్తులు తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని కార్తిక దీపాలను వెలిగించారు. భ్రమరాంబ అమ్మవారు లలితాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. సైకం వారి వీధిలో వేంచేసి ఉన్న శ్రీ దర్వేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలను నిర్వహించారు. వించిపేట రామ్‌గోపాల్‌వీధిలోని రామ్‌గోపాల్ సత్రంలో వేంచేసి ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి, వన్‌టౌన్‌లోని శ్రీ రామ శ్రీకన్యకాపరమేశ్వరీ శ్రీ నగరేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిగాయి.



సహస్రలింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు

మల్లేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు స్వామికి ఆలయ అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ప్రత్యేక బిల్వార్చన సేవ జరిగింది. పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో అర్చకులు సహస్ర లింగార్చన నిర్వహించిన స్వామి వారికి విశేషంగా అలంక రించారు. స్వామిని దర్శించుకున్న భక్తులు ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం స్వామికి పంచహారతుల సేవ, పల్లకీ సేవ, దీపార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులతో పాటు ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మల్లికార్జున స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు



మల్లేశ్వర స్వామికి దీపార్చన చేస్తున్న భక్తులు

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని బెజవాడ రాజారావు హైస్కూల్ కరస్పాండెంట్ బెజవాడ రాజారావు అన్నారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యాధరపురం బెజవాడ రాజారావు హైస్కూల్‌లో సోమవారం ఉపాధ్యాయులు పల్లపోతు మణికుమారి, ఇ.సాయికుమారి, డి.సునీత, టి. ఇందిర, బి.నాగేశ్వరరావు, టి.అశోక్ కుమార్, వై.శ్రీనివాసరావును సత్కరించారు. రాజారావు మాట్లాడుతూ.. అజ్ఞానం అనే అంధకారంలో ఉన్న పిల్లలకు జ్ఞానాన్ని అందించి వారి జీవితాలలో వెలుగులు నింపేది ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు. విద్యా వ్యాప్తిలో 45 శాతం పాత్ర పోషిస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థల ఉపాధ్యాయులను కూడా ప్రభుత్వం బహూకరించే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేయాలని కోరారు. కార్యక్రమంలో హైస్కూల్ కమిటీ సెక్రటరీ శ్యామ్ ప్రకాష్, ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుర్గాఘాట్‌లో భక్తుల పుణ్యస్నానాలు



పుణ్యస్నానాలకు వచ్చిన భక్తులతో రద్దీగా మారిన దుర్గఘాట్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం పుణ్యస్నానాలను ఆచరించే భక్తులను సోమవారం నుంచి దుర్గాఘాట్‌లోకి అనుమతించారు. కార్తిక మాసం ప్రత్యేక పర్వదినాలు, పౌర్ణమి, నోములు, భవానీ, అయ్యప్ప, శివ మాలధారుల సంఖ్య పెరగడంతో పాటు నదిలోకి దిగి పుణ్యస్నానాలు ఆచరించేందుకు అవకాశం కల్పించాలని భక్తుల నుంచి డిమాండ్ వచ్చింది. కొన్ని నెలలుగా దుర్గాఘాట్‌లో భక్తులకు జల్లు స్నానాలకు మాత్రమే దుర్గగుడి దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో కార్తిక మాసం రెండో సోమవారం నుంచి భక్తులు నదిలోకి దిగి పుణ్యస్నానాలు ఆచరించేందుకు అనుమతించారు. భక్తులు సోమవారం పెద్ద ఎత్తున దుర్గాఘాట్‌కు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు.